మళ్లీ ఆయనకే పట్టం

2


2
గంజాయి విక్రేతల అరెస్ట్

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ టోర్నీకి జిల్లా బృందం



**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ టోర్నీకి ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్టును శుక్రవారం ఎంపిక చేసినట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గాండ్ల లింగం తెలిపారు. ఈ జట్టు హన్మకొండలో ఈనెల 21 నుంచి 23 వరకు జరగనున్న టోర్నీలో పాల్గొంటుందన్నారు. క్రీడాకారులను ఒలింపిక్ సంఘం కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, బంటు బలరాం, పీడీలు స్వప్న, అజ్మత్ అభినందించారు.





## ఉచిత చేప విత్తనాలు మత్స్యకారులకు ఉపాధి: పోచారం

**అక్షరటుడే, వర్ని:** దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే వందశాతం సబ్సిడీతో చేప విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోందని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వర్ని మండలం జలాల్‌పూర్‌లోని పెద్ద చెరువులో చేప పిల్లలను శుక్రవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయ స్వామి, ఫిషరీస్ మాజీ అదనపు డైరెక్టర్ శంకర్ నాయక్ రాథోడ్, వర్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేష్ బాబా తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఎప్పుడూ పేదల పార్టీనే..

**అక్షరటుడే, కామారెడ్డి :** కాంగ్రెస్ ఎప్పుడూ పేదల పార్టీనేనని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణంలో 'చంద్రన్న భరోసా' కార్యక్రమంలో భాగంగా వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఇస్రోజివాడి గ్రామానికి చెందిన కడారి లింగం, కామారెడ్డి హరిజనవాడకు చెందిన రాజ్ వీర్ సింగ్, 36వ వార్డుకు చెందిన కుమ్మరి సుమలతలకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పేదల పార్టీ అని పేద ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ మామిండ్ల అంజయ్య, నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఫలితాల సాధనకు 90 రోజుల ప్రణాళిక

**అక్షరటుడే, ఇందూరు :** ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 90 రోజుల ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని డీఐఈవో రవికుమార్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్, డిసెంబర్‌లో సిలబస్ పూర్తి చేయడంతో పాటు ప్రయోగ పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి కళాశాలకు తప్పనిసరిగా హాజరయ్యేట్లు చూడాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. టీచింగ్ డైరీలను కూడా ఆన్‌లైన్ ద్వారానే నమోదు చేయాలని ఆదేశించారు.

**నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో అధికారుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఒకవైపు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు అనుమతులు జారీ చేసి రూ.లక్షలు దండుకున్నారు. మరోవైపు ఎల్ఆర్ఎస్ ప్రక్రియలోనూ భారీగా అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది.**

- అక్షరటుడే, నిజామాబాద్



# ఎల్ఆర్ఎస్ పేరిట మాయాజాలం..

▸ తక్కువ భూమికి ఎక్కువ చూపించి అనుమతులు ▸ ఈ కోణంలోనూ ఏసీబీ విచారణ

నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి తంతుపై ఏసీబీకి వరుస ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో తాజాగా ఏసీబీ డీఎస్పీ ఆధ్వర్యంలో సుదీర్ఘంగా సోదాలు జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా బిల్డింగ్ పర్మిషన్లు జారీ చేసిన ఫైల్స్‌ను పరిశీలించడంతో పాటు వాటిని తమ వెంట తీసుకెళ్లారు. అలాగే ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై కూడా ఏసీబీకి ఫిర్యాదు అందింది. దీంతో ఆ కోణంలోనూ విచారణ చేపట్టింది. మోపాల్ మండలం పరిధిలోని బోర్గాం(పి) గ్రామానికి చెందిన సంబంధించి ఓ అవకతవకల వ్యవహారం ఏసీబీ దృష్టికి వచ్చింది.

ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం పేదల భూములను రెగ్యులరైజ్ చేయాలనే ఉద్దేశంతో ఎల్ఆర్ఎస్ స్కీంను అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. కాగా.. బోర్గాం(పి) గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తొలుత 253 గజాలకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించాడు. ఆ తర్వాత మొత్తం 5 వేల గజాల స్థలాన్ని నగర పాలక సంస్థ అధికారులు ఎల్ఆర్ఎస్ స్కీం కింద రెగ్యులరైజ్ చేశారు. విచిత్రం ఏమిటంటే పైస్థాయి అధికారులకు కూడా ఆమోదం లభించింది. గతంలో పని చేసిన అధికారులు పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకొని ఇలా ఇష్టారాజ్యంగా అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఫైళ్లనింటిని లోతుగా పరిశీలించిన ఏసీబీ అధికారులు తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

## కక్షసాధింపులో భాగంగానే కేటీఆర్‌పై కేసులు




**అక్షరటుడే, ఇందూరు :** కక్ష సాధింపులో భాగంగానే కేటీఆర్‌పై అక్రమంగా కేసులు బనాయించారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఫెవికాల్ బంధం కొనసాగుతుందని విమర్శించారు. నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఫార్ములా కారు రేసుకు సంబంధించి అది తప్పుడు కేసు అని వ్యాఖ్యానించారు. అలాగే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ సఖ్యత ఎలా ఉందో బయటపడిందన్నారు. ఆ రెండు పార్టీల అంతర్గత ఒప్పందంతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిచిందన్నారు. దేశంలో పేరు గడించిన యువ నాయకుల్లో కేటీఆర్ కూడా ఉంటారని.. అలాంటి పేరెన్నిక గన్న పొలిటీషియన్ పేరును పాడు చేసేందుకు రేవంత్‌రెడ్డి పట్టుబట్టారన్నారు. రాష్ట్రంలో శాడిస్టు సీఎం పాలన సాగుతోందన్నారు. కేటీఆర్ ప్రతిపక్షంలో ఉండి ప్రజల కోసం అహర్నిషలు పనిచేస్తున్నారన్నారు. సీఎం చేసే పాడు పనులు కేటీఆర్‌కు ఆపాదించి కక్ష సాధించుకునే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. బీఆర్ఎస్ ఫ్యామిలీ అంటే ఫైటర్స్ ఫ్యామిలీ అని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో 60లక్షల బీఆర్ఎస్ సైన్యం ఉందన్నారు. కేసులకు బీఆర్ఎస్ నేతలు ఎప్పుడూ బయపడలేదని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యప్రకాష్, సుజిత్ సింగ్ ఠాకూర్, దండు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డుల భద్రత కోసం ఆరోగ్య బీమా



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** చిన్నచిన్న అనారోగ్య సమస్యలు కూడా భారంగా మారకుండా హోంగార్డులకు బీమా అవసరమని అదనపు డీసీపీ రామచంద్రరావు అన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆరోగ్య బీమాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అదనపు డీసీపీ (ఏఆర్) మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో అత్యంత ముఖ్య భూమిక పోషించే హోంగార్డుల ఆరోగ్యం, ఆర్థిక భద్రత పోలీస్‌శాఖ బాధ్యత అని అన్నారు. సేవలో నిమగ్నమయ్యే సమయంలో ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా, ఆరోగ్య బీమా మీకు రక్షణ కవచంలా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సతీష్ (హోంగార్డ్స్), శేఖర్ బాబు (ఎంటీవో), శ్రీనివాస్ (అడ్మిన్), తిరుపతి (వెల్ఫేర్), కార్పొరేట్ శాలరీ మేనేజర్ వెంకటేష్, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ శ్రావణ్, బ్యాంక్ అధికారులు, హోంగార్డులు సిబ్బంది పాల్గొన్నారు.



## జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

**అక్షరటుడే, ఇందూరు:** జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల గడువు తీరిపోయి ఏడాదిన్నర గడిచిందని, వాటి స్థానంలో కొత్తవి ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ, మండలాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. నిత్యం ఒత్తిడితో విధులు నిర్వహించే జర్నలిస్టులకు ఎలాంటి కొర్రీలు లేకుండా ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని, అక్రమ కేసులు పరిపాటిగా మారాయన్నారు. వాటిని నివారించేందుకు జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు రాంచందర్, భాస్కర్, వెంకటేష్, మధు, అనిత, పరమేశ్వర్, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో మరింత మంది యువ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయాలని ఫుట్‌బాల్ అకాడమీ ఫౌండర్, డాక్టర్ కవితా రెడ్డి అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఫుట్‌బాల్ కోచెస్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో 'అన్ సంగ్ గురు' అవార్డు అందుకున్న ఫుట్‌బాల్ కోచ్ నాగరాజును శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫుట్‌బాల్ అభివృద్ధికి గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడంలో నాగరాజు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కష్టానికి తగిన ఫలితం అవార్డు అన్నారు. క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తూ మరిన్ని అవార్డులను అందుకోవాలని ఆకాంక్షించారు.

## పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి: సీపీ



**అక్షరటుడే, బోధన్:** పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సీపీ సాయిచైతన్య సూచించారు. బోధన్ డివిజన్ పోలీస్ అధికారులతో శుక్రవారం నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోక్సో, గ్రేవ్ కేసుల్లో వేగంగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలన్నారు. గంజాయి, పేకాట, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని.. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ఉండేలా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీ సాయిచైతన్య సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వ్యక్తులపై ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఆయన పేర్కొన్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో నిర్లక్ష్యం తగదన్నారు. ప్రతి అధికారికి సీసీటీఎన్ఎస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. కేసుల పరిష్కారంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందజేయాలని సూచించారు. నేర నియంత్రణకు కృషి చేయాలని పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ముందుకెళ్లాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించాలని సీపీ సూచించారు. హైవే రోడ్లను కలుపుతూ వెళ్లే లింక్ రోడ్లకు స్పీడ్ బ్రేకర్లను వేయించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించాలన్నారు. రోడ్ల విషయంలో ఇంజినీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే, స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. సమీక్షలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ ఎస్‌హెచ్‌వో వెంకట్ నారాయణ, రుద్రూర్ సీఐ కృష్ణ, బోధన్ రూరల్ ఎస్సైలు మచ్చేందేర్, ఎడపల్లి ఎస్సై రమ, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, కోటగిరి ఎస్సై సునీల్, రుద్రూర్ ఎస్సై సాయన్న, వర్ని ఎస్సై రామరాజు, సీసీఆర్బీ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో అలసత్వం తగదు: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** శాంతి భద్రతల పరిరక్షణలో అలసత్వం తగదని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఆరా తీశారు. గ్రేవ్ కేసుల్లో ఎస్‌వోపీ ప్రకారం.. నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరిపి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించాలని సూచించారు. ఎస్‌హెచ్‌వోలు తమ ఏరియాలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి, ఆ ప్రాంతాల్లోని సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముందస్తు సమాచారాన్ని సేకరించి, చిన్న ఘటనకైనా సమాచారం వచ్చే విధంగా గ్రామస్థులతో బలమైన సంబంధాలు ఏర్పరుచుకోవాలని సూచించారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్‌ల కదలికపై నిఘా ఉంచి తరుచూ చెక్ చేయాలన్నారు. బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ సిబ్బంది పాపిలోన్ డివైస్‌లను వినియోగిస్తూ అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్స్ సేకరించాలని చెప్పారు. వుమెన్ సేఫ్టీ, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కలిపిస్తూ వారిని చైతన్యం చేయాలన్నారు. డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. డీజీపీతో గురువారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసులు పార్థీ గ్యాంగులను పట్టుకోవడంలో చూపిన చురుకుదనాన్ని ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యమన్నారు. ప్రతి పోలీస్ అధికారి గ్రామాల పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని చెప్పారు. సోషల్ మీడియాలో అసాంఘిక ప్రచారంపై పటిష్ట నిఘా ఉంచాలన్నారు. చెడు ప్రవర్తన గల వారిపై బైండోవర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాసరావు, విఠల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ మురళి, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



## ఆబ్కారీశాఖ అధికారుల సంఘం కార్యవర్గం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆబ్కారీ శాఖ అధికారుల సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డీటీఎఫ్ విలాస్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో అంజిత్ రావు, ప్రధాన కార్యదర్శిగా కామారెడ్డికి చెందిన ఎస్‌హెచ్‌వో విక్రమ్ కుమార్ ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా నిజామాబాద్ ఎస్‌హెచ్‌వో ఏ.గంగాధర్, ఉపాధ్యక్షుడిగా బోధన్ ఎస్‌హెచ్‌వో భాస్కర్ రావు, కార్యదర్శిగా ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో ప్రమోద్ చైతన్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నిజామాబాద్‌కు చెందిన ఎస్‌హెచ్‌వో మల్లేష్, జయంతి సెక్రెటరీగా వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా దిలీప్ (బాన్సువాడ), మధుసూదన్‌రావు (దోమకొండ), తేజస్విని (బాన్సువాడ), శరత్ (కామారెడ్డి)లను ఎన్నుకున్నారు.



## బీఆర్ఎస్ నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


**అక్షరటుడే, కామారెడ్డి:** పర్వతారోహకురాలు మాలవత్ పూర్ణను పరామర్శించడానికి వెళ్తున్న మంత్రి సీతక్కను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. జిల్లా పర్యటనకు గురువారం వచ్చిన గిరిజన మంత్రి మాలవత్ పూర్ణను పరామర్శించడానికి వెళ్తున్న క్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి, మరో ఇద్దరు బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. పక్కనే ఉన్న వైన్స్‌లో మద్యం సేవించి అక్కడున్న వారిని ఉసిగొల్పి కాన్వాయికి అడ్డుగా వచ్చారని ఆరోపించారు. కారు డ్రైవర్ అప్రమత్తతతో మంత్రికి ప్రమాదం తప్పిందన్నారు. గిరిజన మంత్రిని అడ్డుకున్న మాజీ ఎంపీపీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రానా ప్రతాప్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నునావత్ గణేష్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం డివిజన్ అధ్యక్షుడు సదర్ నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు రూప్ సింగ్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రీ నాయక్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవి నాయక్, టౌన్ అధ్యక్షుడు రొత్వన్ మోహన్ నాయక్ పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ పార్థీవ దేహానికి పోచారం శ్రద్ధాంజలి



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్ మాజీ సర్పంచ్ ఉద్దెర చిన్న హన్మాండ్లు గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ ఇబ్రాహీంపేట్ గ్రామానికి చేరుకున్నారు. హన్మాండ్లు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. హన్మాండ్లు మృతి గ్రామానికి పెద్ద లోటని పోచారం పేర్కొన్నారు.

### అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి



**అక్షరటుడే, బాన్సువాడ:** ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ ఉద్దెర చిన్న హన్మాండ్లు అప్పా అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి హాజరై పార్థీవదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. హన్మాండ్లు అకస్మిక మరణం చాలా బాధాకరమన్నారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రజానాయకుడు ఆయన అని తెలిపారు.

విద్యాశాఖలోని ఉమ్మడి పరీక్షల విభాగం (డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) కార్యదర్శిగా మళ్లీ సీతయ్యను నియమించారు. ఇప్పటికే రెండు పర్యాయాలు కార్యదర్శిగా చేసినా.. జిల్లా విద్యా శాఖ అధికారి తిరిగి ఆయనకే పట్టం కట్టారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇతరులకు అవకాశం ఇవ్వకుండా ఆయన వైపే మొగ్గు చూపడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. - అక్షరటుడే, ఇందూరు



# మళ్లీ ఆయనకే పట్టం

■ డీసీఈబీ కార్యదర్శిగా సీతయ్య ■ ఇప్పటికే రెండు పర్యాయాలు పూర్తి ■ ఉపాధ్యాయ సంఘాల అసంతృప్తి

డీసీఈబీ కార్యదర్శిగా ఉన్న సీతయ్య పదవి కాలం గత నెలలో ముగిసింది. దీంతో శుక్రవారం కమిటీ సభ్యులతో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సమావేశం నిర్వహించారు. కార్యదర్శి ఎన్నికకు సంబంధించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. సమావేశంలో మళ్లీ ఆయనకే బాధ్యతల అప్పచెప్తున్నట్లు డీఈవో ప్రకటించారు. అయితే ఇప్పటికే సీతయ్య రెండు పర్యాయాలు కొనసాగారు. ఆయన హయాంలో అనేక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రధానంగా పేపర్లు లీక్ అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. విచారణ చేపట్టి ఓ క్లర్క్‌ను సస్పెండ్ చేశారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయులను కార్యదర్శిగా నియమించాలి. కానీ లోకల్ బాడీ ఉపాధ్యాయుడిని కార్యదర్శిగా నియమించడంపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

### ఇతరులు కోరినా..

ఉమ్మడి పరీక్షల విభాగంలో 12 మంది సభ్యులతో కూడిన కమిటీ ఉంటుంది. సభ్యుల్లోని ఒకరికి కార్యదర్శి బాధ్యతలను అప్పజెప్తారు. అయితే సభ్యుల్లోని సీనియర్ ప్రధానోపాధ్యాయుడైన శంకర్ దరఖాస్తు చేసుకున్నారు. అవకాశం ఉంటే తాను కార్యదర్శిగా విధులు నిర్వహిస్తానని జిల్లా విద్యా శాఖ అధికారికి లేఖ రాశారు. కానీ సమావేశంలో మళ్లీ సీతయ్యను నియమిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. నిజానికి వ్యక్తిగత అభిప్రాయాలను సేకరిస్తే కార్యదర్శి ఎవరిని నియమించాలో స్పష్టమవుతుంది. కానీ అలా జరగలేదనేది సభ్యులే గుసగుసలాడుతున్నారు. దీంతో మళ్లీ సీతయ్యను నియమించడం వెనక మతలబేమిటోననే చర్చ జరుగుతోంది.

### ఉపాధ్యాయ సంఘాల గుర్రు..

ఇప్పటికీ రెండు పర్యాయాలు కార్యదర్శిగా కొనసాగిన సీతయ్యను మళ్లీ నియమించడంపై పలు ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్, టీపీటీఎఫ్, పీఆర్టీయూ తెలంగాణ సంఘాలు వినతి పత్రాలు సైతం అందజేశాయి. ఏకపక్ష నిర్ణయాలు సరికాదని, ఇతరులు దరఖాస్తు చేసుకున్న మళ్లీ ఆయనకే బాధ్యతల అప్పజెప్పడం తగదని పలువురు ఉపాధ్యాయులు అంటున్నారు.

### సభ్యుల అభిప్రాయం సేకరించాం

డీసీఈబీ కార్యదర్శిగా సీతయ్యను నియమించాం. సమావేశంలో కమిటీ సభ్యుల అభిప్రాయం సేకరించి నిర్ణయం తీసుకున్నాం. ఇది ఏకపక్ష నిర్ణయం కాదు. కమిటీ సభ్యుల నిర్ణయం మేరకే మరో రెండేళ్లు ఆయనకు బాధ్యతలు అప్పగించాం.
– అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి



## ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** ఏడుగురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.1 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ మేరకు సౌత్ రూరల్ సీఐ సురేశ్ కుమార్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. మోపాల్ మండలం కంజర్ శివారులో గంజాయి అమ్ముతున్నారనే సమాచారం రావడంతో మోపాల్ ఎస్సై సుష్మిత సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు అమీర్ ఖాన్, షేక్ అఫ్రోజ్, శివతేజలను అదుపులోకి తీసుకున్నారు. వీరు నాందేడ్ నుంచి రైళ్లలో తీసుకువస్తున్నట్లు గుర్తించారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు నాందేడ్ వెళ్లి.. వీరికి గంజాయి అమ్ముతున్న షేక్ ఇమ్రాన్, మిర్జా జుబేర్ బేగ్, అముల్ చౌరే, షేక్ షేర్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఏడుగురు నిందితులను కేసులో అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు కిలోలకుపైగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించడంలో కృషి చేసిన సీఐ సురేశ్‌కుమార్, ఎస్సై సుష్మిత, సిబ్బందిని సీపీ సాయి చైతన్య అభినందించారు.



## నకిలీ నోట్ల తయారీ ముఠా సభ్యునిపై పీడీ యాక్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** అంతర్రాష్ట్ర నకిలీ నోట్ల ముఠా సభ్యుల్లో ఒకరిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని ఓ వైన్ షాప్‌లో రెండు నకిలీ 500 నోట్లు వినియోగించిన ఘటనపై మేకల అఖిల్ గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో కేసును దర్యాప్తు చేసిన జిల్లా పోలీసులు.. తెలంగాణ, వెస్ట్ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించారు. మొత్తం 8 మంది నిందితులను అక్టోబర్ 11న అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రధాన నిందితుడు కరెన్సీ కాట్ని అలియాస్ లఖన్ కుమార్ దుబేపై కామారెడ్డి, కోల్‌కతాలో కూడా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఇతను నిజామాబాద్ సెంట్రల్ జైలులో ఉండగా పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఈ ఉత్తర్వులను కామారెడ్డి టౌన్ సీఐ నరహరి, హెడ్ కానిస్టేబుల్ నర్సింలు నిందితునికి అందజేశారు.



## వేల్పూర్‌లో సాయి భక్తుల భిక్షాటన

**అక్షరటుడే, ఆర్మూర్:** వేల్పూర్ శివారులోని గోవిందసాయి దివ్యయోగాశ్రమం, షిర్డీ సాయిబాబా దేవాలయం వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వేల్పూర్‌లో గోవింద సాయి సేవా సమితి సభ్యులు భిక్షాటన నిర్వహించారు. కార్యక్రమంలో సాయి సేవాసమితి ధర్మ ప్రచారకులు, ప్రచార కార్యదర్శి కంకణాల రాజేశ్వర్, బెంగళూరుకు చెందిన గోవిందగిరి స్వామి శిష్యుడు రాఘవేంద్ర స్వామి, గోవిందసాయి సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయం వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. కళాశాల లైబ్రరీలో పుస్తక ప్రదర్శన చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు ఆసక్తిగా పుస్తక ప్రదర్శనను వీక్షించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 'గ్రంథాలయ ప్రాముఖ్యత' ఇతివృత్తంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ చంద్రిక మాట్లాడుతూ.. పుస్తక పఠనం ప్రాధాన్యతను గ్రంథాలయ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇట్టెడి నర్సారెడ్డికి మాజీ ఎమ్మెల్యే నివాళి

**అక్షరటుడే, ఆర్మూర్:** బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందిన ఆర్మూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఇట్టెడి నర్సారెడ్డికి మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నివాళులర్పించారు. హైదరాబాద్‌లో నర్సారెడ్డికి పార్థీవ దేహానికి ఆయన పూలమాలలు వేశారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. నర్సారెడ్డి కుటుంబసభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చిన విషయం తెలిసిందే.





## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రాంసింగ్

**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట మండలం కుద్వాన్‌పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన రామ్ సింగ్ రాష్ట్రస్థాయి అండర్-17 బాయ్స్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సుచరిత తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు రామ్ సింగ్ ఎంపికయ్యేలా తర్ఫీదునిచ్చిన పాఠశాల పీడీ రాజేశ్వర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరునగరి ప్రసాద్, మీసాల భీంరావ్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** డొంకేశ్వర్ మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు బీజేపీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎనుగందుల సాగర్, బూత్ అధ్యక్షుడు గైని లింగం, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని సిర్నపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి స్మరణి ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రి చికిత్స పొందింది. అనంతరం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు బీజేపీ నాయకులు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారికి సమాచారం అందించారు. ఆయన స్పందించి ఎంపీ అర్వింద్ సహకారంతో బాధిత కుటుంబానికి రూ. 51,500 సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు చేయించారు. దీంతో బీజేపీ మండలాధ్యక్షుడు లోలం సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నాయిడి రాజన్న, జిల్లా కార్యదర్శి ఉప్పు సవిత, కన్వీనర్ జెల్లెల్ల శ్రీనివాస్, గ్రామ బీజేపీ సీనియర్ నాయకులు సందీప్ గౌడ్, మోతె రాజు, సంతోష్ పాల్గొన్నారు.

## డ్రంకన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

**అక్షరటుడే, ముప్కాల్:** డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ముప్కాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా నర్సయ్య అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లుగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. విచారించిన న్యాయమూర్తి గట్టు గంగాధర్ నర్సయ్యకు నాలుగురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.